16న ప్రధాని మోదీ విశాఖ రాక



- రైల్వే మైదానంలో ఎన్నికల సభ

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే శనివారం విశాఖలోని రైల్వే మైదానంలో నిర్వహించనున్న సభలో ప్రధాని పాల్గొంటారని స్థానిక బీజేపీ నాయకులు వెల్లడించారు. విశాఖపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించాలని ... మిగతా 8వ పేజీలో

పునాదుల్లోనే విత్తన కేంద్రం

రైతు ప్రయోజనాలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం



గంధవరంలో పునాది స్థాయిలో నిలిచిన విత్తన శుద్ధి కేంద్రం, విత్తన గిడ్డంగి నిర్మాణం

- చోడవరం మండలం గంధవరంలో విత్తన శుద్ధి కేంద్రం, గోదాముల నిర్మాణానికి 2020 జులైలో శంకుస్థాపన
- భూమి పూజ చేసిన అప్పటి మంత్రులు కన్నబాబు, ముత్తంశెట్టి, ఎంపీ విజయసాయిరెడ్డి
- ఏడాదిలో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటన
- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
- నిర్మాణ పనులకు అడ్డుగా మారిన రాతిగుట్టలు
- వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం
- ఎట్టకేలకు ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం
- పునాదుల వరకు పనులు.. మంజూరు కాని బిల్లులు
- గత ఏడాది ఏప్రిల్‌లో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని మంత్రులు, ప్రభుత్వ విప్

చోడవరం, మార్చి 10:

ఉమ్మడి విశాఖ జిల్లాలో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాల నిల్వ కోసం మండలంలోని గంధవరంలో విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడున్నర సంవత్సరాలు దాటినప్పటికీ ఇంతవరకు పునాదుల పనులు కూడా పూర్తికాలేదు. 2020 జూలై 9వ తేదీన భూమి పూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో నాటి మంత్రులు కె.కన్నబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఏడాదిలో పనులు పూర్తిచేసి విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఇది జరిగి సరిగ్గా 44 నెలలు అవుతున్నది. విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రానికి శుంకుస్థాపన చేసిన ప్రదేశానికి వెళ్లి చూస్తే వైసీపీ పాలకులు తీరు 'మాటలు కోటలు దాటుతుంటే... చేతలు గడప దాటడం లేదు' అన్న చందంగా వుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడా విత్తన గిడ్డంగి లేదు. జిల్లా రైతులకు అవసరమైన విత్తనాలు విజయనగరం జిల్లాలోని గోదాము నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతులకు వివిధ పంటల సాగుకు మేలైన విత్తనాలను అందజేయడానికి జిల్లాలోనే విత్తన గిడ్డంగి ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అవసరమైన ఐదు ఎకరాల భూమిని మండలంలో గంధవరంలో గుర్తించారు. స్థల సేకరణ పూర్తయ్యే సమయానికి రాష్ట్రంలో ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఏడాది వరకు విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం గురించి పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రూ.4.7 కోట్ల అంచనా వ్యయంతో 2020 జూలై 9వ తేదీన అప్పటి మంత్రులు కురసాల కన్నబాబు (వ్యవసాయ), ముత్తంశెట్టి శ్రీనివాసరావు (పర్యాటక), రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి కూడా పాల్గొన్నారు. విశాఖ జిల్లాకు అవసరమైన విత్తనాలను ఇప్పటివరకు విజయనగరం జిల్లా నుంచి తీసుకుని వస్తున్నారని, గంధవరంలో విత్తనశుద్ధి కేంద్రం, గిడ్డంగి పనులు పూర్తయితే సమయం, రవాణా చార్జీలు ఆదా అవుతాయని మంత్రులు చెప్పారు. 40 వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన వీటి నిర్మాణ పనులను ఏడాదిలో పూర్తిచేసి, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించచారు. దీనివల్ల ఇటు మైదాన ప్రాంతం అటు ఏజెన్సీ రైతులకు స్థానికంగానే విత్తనాలు అందుబాటులో వుంటాయని తెలిపారు. విత్తన శుద్ధి కేంద్ర, నిల్వ గోదాముల నిర్మాణ బాధ్యతలను విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించగా టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. స్థలంలో నల్ల రాళ్ల గుట్టలు ఉండడంతో అవి తొలగించి స్థలాన్ని అప్పగిస్తే పనులు చేపడతామని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. నెలలు గడిచిన తరువాత నల్లరాయి బ్లాస్టింగ్ కోసం మైనింగ్ శాఖకు దరఖాస్తు చేశారు. అనుమతి వచ్చిన తరువాత రాళ్లను బ్లాస్టింగ్ చేసి, వాటిని అక్కడ నుంచి తీసుకుపోయేందుకు కాంట్రాక్టు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. అయితే నల్లరాళ్లను తీసుకు వెళ్లేందుకు ఎన్ని నెలలైనా ఎవరూ ముందుకు రాలేదు. చివరకు రాళ్లను పక్కకు తొలగించి ఏడాదిన్నర క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదులస్థాయి వరకు పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్ బిల్లు అప్‌లోడ్ చేశారు. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో గత ఏడాది ఏప్రిల్‌లో పనులు ఆపేశారు. విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం గురించి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు.. బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎందుకు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనుండడంతో విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం అటకెక్కినట్టేనని అభిప్రాయపడుతున్నారు.



విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రదేశం ఇదే!



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

వైసీపీ సభకు ఆర్టీసీ బస్సులు!

ప్రయాణికుల అవస్థలు

- అనకాపల్లి కాంప్లెక్స్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి
- 500 కిలోమీటర్ల దూరంలో జరిగే సభకు ఇక్కడ నుంచి బస్సులు పంపడంపై మండిపడుతున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, మార్చి 10:

ప్రజా రవాణా శాఖ (పీటీడీ) అధికారులు అధికార పార్టీ సేవలో తరించిపోతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఉత్తర కోస్తాలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొనే అధికారిక సభలే కాకుండా వైసీపీ పరంగా నిర్వహించే సభలకు కూడా జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను నిరభ్యంతరంగా ఇచ్చేస్తున్నారు. దీంతో బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు పడే ఇబ్బందులు, ఇక్కట్లను పట్టించుకోవడం లేదు. తాజాగా ఎక్కడో ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఆదివారం వైసీపీ నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభకు ప్రజలను తరలించేందుకు జిల్లాలోని రెండు (అనకాపల్లి, నర్సీపట్నం) డిపోల నుంచి చెరో 25 చొప్పున మొత్తం 50 బస్సులను శనివారంనాడే ఇక్కడి నుంచి పంపారు. ఫలితంగా అనకాపల్లి, నర్సీపట్నంలోనే కాకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో నిర్వహిస్తున్న వైసీపీ 'సిద్ధం' సభకు అనకాపల్లి పీటీడీ డిపో నుంచి 25 బస్సులను శనివారం సాయంత్రమే ఇక్కడి నుంచి పంపారు. ఇవి ఆదివారం ఉదయానికి చీరాల, చుట్టుపక్కల ప్రాంతాలకు చేరుకున్నాయి. మధ్యాహ్నం నుంచి ఆయా ప్రాంతాల నుంచి సిద్ధం సభకు జనాలను తరలించి, సభ ముసిగిన తరువాత తిరిగి వారి ప్రాంతాలకు తీసుకురావాలి. అర్ధరాత్రి అక్కడి నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి అనకాపల్లి చేరుకుంటాయి. పీటీడీ అధికారుల తీరుతో పలు ప్రాంతాల ప్రయాణికులు రెండు రోజులపాటు బస్సుల కొరతతో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అనకాపల్లి నుంచి విశాఖపట్నం, విజయనగరం, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం, దేవరాపల్లి రూట్లలో నడిచే బస్సుల్లో కొన్నింటిని మేదరమెట్ల సభకు పంపారు.



ఆదివారం రాత్రి పల్లెవెలుగు బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న ప్రయాణికులు

ఇదిలావుండగా మూడు రోజులు సెలవులపాటు (శుక్రవారం మహాశివరాత్రి, రెండో శనివారం, ఆదివారం) సెలవులు రావడంతో ఉద్యోగం, ఉపాధి, వ్యాపార నిమిత్తం పట్టణాల్లో నివాసం వుంటున్న వారిలో పలువురు సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లారు. వీరంతా ఆదివారం సాయంత్రం లేదా సోమవారం ఉదయం తిరుగు ప్రయాణం అవుతారు. ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా గంటల తరబడి వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు బస్సులకు సరిపడ ప్రయాణికులు ఒక బస్సులోనే ఇరుక్కుని వెళుతున్నారు. మరికొంత మంది అధికచార్జీలు చెల్లించి ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రాజకీయ పార్టీల సభలకు కూడా ఆర్టీసీ బస్సులను కేటాయించడం ఏమిటని పీటీడీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు.



అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫొటో)

అంగన్‌వాడీలకు మొండిచేయి!

సమ్మె కాలానికి అందని వేతనాలు

- మంత్రి మాట ఇచ్చినా అమలుకు నోచని వైనం
- జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు రూ.3,98,97,420 బకాయిలు
- ఇంతవరకు అందని ఫిబ్రవరి వేతనాలు
- ఈ బకాయిలు రూ.2,98,95,000
- అంగన్‌వాడీలకు మొత్తం అందాల్సింది రూ.6,97,92,420
- ఆరు నెలలుగా గ్యాస్, కూరగాయలు బిల్లులు పెండింగ్

విశాఖపట్నం/ కోటవురట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

'అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సమ్మె కాలానికి కూడా వేతనాలు చెల్లిస్తాం'... 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేసిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నేతలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇచ్చిన హామీ. ఇది జరిగి 50 రోజులు కావస్తోంది. ఇప్పటివరకు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను చెల్లించలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తున్నా.. ఎటువంటి స్పందన కనిపించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కలిపి సుమారు నాలుగు కోట్ల రూపాయలు అందాల్సి వుంది.

జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,908 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. ఖాళీలు పోను ప్రస్తుతం 1,566 మంది కార్యకర్తలు, 1,525 మంది హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు మరో 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు వుండగా వీటిలో 173 మంది పనిచేస్తున్నారు. సమ్మె కాలానికి మెయిన్ సెంటర్ల కార్యకర్తకు రూ.15,350 చొప్పున, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కార్యకర్తలు, మెయిన్ కేంద్రాల హెల్పర్లకు రూ.9,340 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ ప్రకారం మెయిన్ సెంటర్లలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.2,40,38,100, ఈ కేంద్రాలో పనిచేస్తున్న హెల్పర్లు, మినీ కేంద్రాల కార్యకర్తలకు రూ.1,58,59,320 అందాల్సి వుంది. మొత్తం మీద రూ.3,98,97,420 ప్రభుత్వం బకాయి వుంది. సాక్షాత్తూ మంత్రి హామీ ఇచ్చి వారాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంతో అసోసియేషన్ నాయకులను సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తక్షణం వేతనం జమయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో మంత్రులను కలిసేందుకు అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఫిబ్రవరి వేతనాలేవీ?

ఇదిలా ఉండగా మార్చి పదో తేదీ వచ్చినా ఫిబ్రవరి నెల వేతనాలు ఇప్పటివరకు సిబ్బందికి జమకాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాకు రూ.7 వేలు, కార్యకర్తకు రూ.11,500 చొప్పున ... మిగతా 8వ పేజీలో

నగరంలో అల్లు అర్జున్ సందడి

విశాఖపట్నం, మార్చి 10:

నగరంలో ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ సందడి చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో జరగనున్న సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. అప్పటికే అక్కడి చేరిన అభిమానులకు అభివాదం తెలిపారు. కాగా సోమవారం నుంచి జరిగే సినిమా చిత్రీకరణలో ఆయన పాల్గొంటారని సమాచారం.



అభిమానులకు అభివాదం చేస్తున్న హీరో అల్లు అర్జున్

సూదికొండ కబ్జా!

- రెండేసి సెంట్ల చొప్పున ప్లాట్లు
- నకిలీ ఎల్‌పీసీలతో కొనుగోలుదారులకు బురడీ
- ఒక్కో ప్లాట్ రూ.5-6 లక్షలకు విక్రయం
- ఇళ్లు నిర్మించుకుంటున్న కొనుగోలుదారులు
- ఆధారాలతో సహా స్పందనలో ఫిర్యాదు చేసిన స్థానికులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గొర్లివానిపాలెంలో కొండవాలు ప్రదేశం చదును



సబ్బవరం శివారు గొర్లివానిపాలెం సమీపంలో ఆక్రమణదారుడు విక్రయించిన స్థలంలో నిర్మించిన ఇల్లు

సబ్బవరం, మార్చి 10:

స్థానిక పంచాయతీ పరిధిలోని గొర్లివానిపాలెం సమీపంలో ఉన్న సూదికొండ వాలు ప్రదేశం ఆక్రమణకు గురవుతున్నది. గత ఏడాది ఈ ప్రాంతంలో జగనన్న కాలనీ ఏర్పాటు కావడంతో ఇక్కడ ఇళ్ల స్థలాలకు గిరాకీ ఏర్పడింది. దీంతో స్థానిక వ్యక్తి ఒకరు సూదికొండ వాలు ప్రదేశాన్ని చదును చేసి, సెంటు రూ.2-3 లక్షలకు అమ్ముతున్నాడు. పైగా రెవెన్యూ అధికారులు జారీ చేశారంటూ ఎల్‌పీసీలు (నకిలీ) చూపుతున్నాడు. దీంతో నిజమేనని నమ్మి పలువురు వ్యక్తులు స్థలాలు కొనుగోలు చేస్తున్నారు.

సబ్బవరం శివారు గొర్లివానిపాలెం సమీపంలో ఉన్న సూది కొండ వాలు ప్రాంతం (సర్వే నంబరు 286)లో కొండ పోరంబోకు స్థలంలో 2002-03 సంవత్సరంలో సుమారు 10 మంది నిరుపేద రెల్లి కులస్థులకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని 'రెల్లి కాలనీ' అని పేరు పెట్టుకున్నారు. కాలనీకి ఆనుకొని సుమారు రెండు ఎకరాల మేర కొండపోరంబోకు స్థలం ఉంది. దీనిపై కన్నేసిన స్థానిక వ్యక్తి ఒకరు.. స్థలాన్ని చదును చేసి 30 నుంచి 35 ప్లాట్లు ఏర్పాటు చేశాడు. వీటికి నకిలీ ఎల్‌పీసీలు పుట్టించాడు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి సబ్బవరంలో స్థిరపడిన వారికి ఈ స్థలాలను అమ్ముతున్నాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది రెల్లి కాలనీకి ఆనుకుని జగనన్న కాలనీ ఏర్పాటైంది. దీంతో ఇక్కడ ఇళ్ల స్థలాలకు గిరాకీ పెరిగింది. కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి రెండేసి సెంట్ల చొప్పున ప్లాట్లుగా వేసి రూ.5-6 లక్షలకు విక్రయిస్తున్నాడు.



కొండను తొలిచి షెడ్డు నిర్మించిన దృశ్యం

నకిలీ ఎల్‌పీసీలతో విక్రయాలు

ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే తొలుత రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీ(ల్యాండ్ పొజెషన్ సర్టిఫికెట్)ని లబ్ధిదారుని పేరుతో మంజూరు చేస్తారు. లే-అవుట్ వేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన తరువాత పట్టాలు పంపిణీ చేస్తారు. రెల్లి కాలనీకి సమీపంలో కొండపోరంబోకు భూమిని ఆక్రయించి, ఇళ్లస్థలాలుగా అమ్ముతున్న వ్యక్తి పాత తేదీలతో (2006-07 సంవత్సరం) ఎల్‌పీసీలు సృష్టించాడు. సుమారు 17 సంవత్సరాల క్రితం జారీ అయిన ఎల్‌పీసీలుగా నమ్మబలుకుతుండడంతో పలువురు వ్యక్తులు ఈ స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. దీనిపై స్థానిక వ్యక్తి ఒకరు నెల రోజుల క్రితం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. నకిలీ ఎల్‌పీసీలతోసహా క్రయవిక్రయాలు జరిగినట్టు (అన్‌రిజిస్టర్డ్ స్టాంప్ పేపర్లు) ఆధారాలతో అధికారులకు సమర్పించారు. కానీ రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

కొత్త జిల్లాలకు ఎస్‌ఈలు ఏరి?

మూడు జిల్లాలకు ఒకరే విద్యుత్ అధికారి



- భారమవుతున్న పనుల పర్యవేక్షణ
- జేపీసీ సమావేశంలో సర్కిల్స్ ఏర్పాటుకు మంత్రి అంగీకారం
- ఏళ్లు గడుస్తున్నా చర్యలపై మీనమేషాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తున్నా విద్యుత్ శాఖలో అధికారుల నియామకం చేపట్టలేదు. పనులన్నీ పాత జిల్లాల అధికారుల ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. అంతేకాదు పదోన్నతులు, కొత్త ఉద్యోగాల సృష్టి, సిబ్బంది నియామకం చేపట్టలేదు. గతంతో పోల్చుకుంటే విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. 24/7 సరఫరా ఇవ్వాల్సి ఉంది. సకాలంలో బిల్లుల జారీ, వసూలు కత్తిమీద సాముగా మారింది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రాజెక్టులను కూడా ఇక్కడి డిస్కమ్ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంది. వ్యవసాయానికి విద్యుత్ మీటర్ల అమరిక, భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు, స్మార్ట్ మీటర్లు.. ఇలా అనేక అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది.

జిల్లా కేంద్రంగా సర్కిల్ ఏర్పాటుచేసి దానికి సూపరింటెండింగ్ ఇంజనీర్ (జిల్లా అధికారి), డివిజన్లు, డివిజనల్ ఇంజనీర్లు, సహాయక, జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్లు, ఇలా వందలాది మందిని నియమించాల్సి ఉంది. ఎక్కడ ఏ సమస్య వచ్చినా నిర్దేశించిన సమయం (కొన్ని గంటలు)లోనే పరిష్కరించాలి. అంతేకాదు దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఇటీవల కేంద్రం సూచించింది. వీటిని అమలు చేయాల్సింది కూడా క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లే. అయినప్పటికీ సర్కిల్స్ ఏర్పాటు కాక సమస్యలు ఎదురవుతున్నాయి.

రాష్ట్రంలో గతంలో 13 జిల్లాలుండగా రెండేళ్ల క్రితం ప్రభుత్వం అదనంగా మరో 13 జిల్లాలను ఏర్పాటు చేసింది. వాటికి కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఆర్డీవోలను నియమించింది. విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల ఇలా అన్ని శాఖలకు జిల్లా అధికారుల నియామక ప్రక్రియ సాగింది. కానీ విద్యుత్ శాఖకు సంబంధించి కొత్త సర్కిళ్లను ఏర్పాటు చేయలేదు. ఎస్‌ఈలను నియమించలేదు. ఈ వ్యవహారాలన్నీ స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థలే చూసుకోవాలని తేల్చి చెప్పింది. కొన్నాళ క్రితం ఏపీ ట్రాన్స్‌కో, పంపిణీ సంస్థల సీఎండీలతో నిర్వహించిన జాయింట్ కమిటీ సమావేశంలో కొత్త సర్కిళ్ల ఏర్పాటు, అధికారుల నియామకంపై సీఎండీలు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. దీనికి ఆ శాఖ మంత్రి కూడా ఆమోదం తెలిపారు. ఆ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థలు ఫైళ్లు సిద్ధం చేశాయి. అయితే ఆ తరువాత ఏం జరిగిందో.. ఆమోదించిన మంత్రే తరువాత చూద్దామంటూ పక్కన పెట్టేశారు.

మరో మూడు సర్కిల్స్ అవసరం

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు ఉండగా పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పాడేరు (అల్లూరి సీతారామరాజు) జిల్లాలు కొత్తగా ఏర్పడ్డాయి. అంటే అదనంగా మూడు సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. పార్వతీపురం, అనకాపల్లి, పాడేరుల్లో ఆయా కార్యాలయాలు, ఎస్‌ఈలను నియమించి, సిబ్బందిని సమకూర్చాలి. కానీ రెండేళ్లుగా ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌ఈతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను నడిపిస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో స్పందన కార్యక్రమం జరుగుతుంది. విద్యుత్ శాఖ సమస్యలపై చర్చించేందుకు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

మద్యం పట్టివేత : ఏడుగురి అరెస్టు

» గోవా నుంచి కాకినాడకు తరలింపు


జాతీయ రహదారి బాటజంగాలపాలెం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న మద్యం నిందితులతో పోలీసులు

సబ్బవరం, మార్చి 10: అనకపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం చెక్‌పోస్టు వద్ద గోవా నుంచి కాకినాడ తరలిస్తున్న అక్రమ మద్యం సీసాలను ఆదివారం సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇన్నోవా కారు డ్రైవర్‌తో సహా ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఇటీవల జాతీయ రహదారి బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇన్నోవా కారును పరిశీలించారు. అందులో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. వారి వద్ద ఆరు బ్యాగులు ఉన్నాయి. వాటిని తీసి పరిశీలించగా ఒక్కో బ్యాగులో పది చొప్పున మద్యం బాటిళ్లు ఉన్నాయి. బాటిల్స్‌తోపాటు ఆరుగురునిఇ స్టేషన్‌కు తరలించి విచారించారు. కాకినాడకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఇటీవల గోవా టూర్‌కు వెళ్లారు. అటు నుంచి బెంగళూరు మీదుగా విశాఖ ఎయిర్ పోర్టుకు ఆదివారం చేరుకున్నారు. ఎయిర్ పోర్టు నుంచి కాకినాడు వెళ్లేందుకు కారును బుక్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి జాతీయ రహదారిపై కాకినాడ వెళుతుండగా బాటజంగాలపాలెం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారు. అయితే గోవాలో తాము 40 చిన్న(90 ఎంఎల్), 20 ఫుల్ బాటిల్స్(720 ఎంఎల్) కొనుగోలు చేశామని చెప్పి, వాటి విలువ రూ. 30 వేలు అని చెప్పి వాటి బిల్లు చూపించినట్టు సీఐ తెలిపారు. అయితే కస్టమ్ సుంకం(నాన్ డ్యూటీ పెయిడ్) చెల్లించకుండా మద్యం తరలించడం నేరం కావడం వలన డ్రైవ్ సహా ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ రమణ తెలిపారు.

11 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మార్చి 10 : మండలంలోని తాళ్లపాలెంలో ఒక వ్యక్తి నుంచి 11 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ఆదివారం తాళ్లపాలెం కూడలి వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎం.అప్పారావు సంచితో 11 మద్యం క్వార్టర్ బాటిళ్లు తీసుకువెళుతుండగా పట్టుకున్నామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

ఇద్దరిని కాపాడిన మెరైన్ పోలీసులు


బోయపాడు సముద్ర తీరంలో మునిగిన వ్యక్తిని కాపాడిన హోంగార్డు జగన్నాథం

పాయకరావుపేట రూరల్, మార్చి 10 : మండలంలోని పెంటకోట మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీర ప్రాంతంలో ఆదివారం రెండు చోట్ల ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగిపోయిన ఇద్దరు వ్యక్తులను మెరైన్ పోలీసులు కాపాడారు. మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ డీవీజే.రమేష్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం బోయపాడు తీరంలో ఆదివారం సముద్ర స్నానానికి దిగిన మొద్దు భోగిరాజుకు అనే వ్యక్తికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కొట్టుకుపోతుండగా గుర్తించిన హోంగార్డు జగన్నాథం ఈదుకుంటూ వెళ్లి కాపాడారన్నారు. అదేవిధంగా పెంటకోట వద్ద సముద్రంలో స్నానానికి దిగిన శేషాద్రి అనే యువకుడు ప్రమాదశాత్తూ కొట్టుకుపోతుంటే గుర్తించిన హోంగార్డు గోపి కాపాడినట్టు తెలిపారు.

ఆర్టీసీ బస్సు- బైక్ ఢీ : ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


మృతుడు బాలరాజు (ఫైల్)

గొలుగొండ, మార్చి 10 : ఆర్టీసీ బస్సు-బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన పాల్, సామర్ల బాలరాజు (23) అనే యువకులు ఇద్దరూ ఆదివారం నర్సీపట్నం నుంచి తమ స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. గొలుగొండ మండలం రావణాపల్లి మలుపు వద్దకు వచ్చేసరికి చింతపల్లి నుంచి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే వీరిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలరాజు మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రైతు ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

అచ్యుతాపురం, మార్చి 10: ఈనెల 14న ఢిల్లీలో జరిగే ఉద్యమానికి రైతులంతా సహకరించాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పెదపాడు, హరిపాలెం, కొండకర్లలో వారు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 14న తిమ్మరాజుపేట జంక్షన్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి రైతులంతా రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, రామసదాశివరావు, జె.సూర్యనారాయణ, బి.రంగారావు, ఆర్.రాము, ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్‌లు

» జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్



కప్ప స్తంభం వద్ద ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, అనకాపల్లి జేసీ జాహ్నవి. పక్క చిత్రంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ దంపతులు

సింహాచలం, మార్చి 10: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఆయన సతీమణి, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ ఏఈఓ భ్రమరాంబ, పర్యవేక్షణాధికారి వెంకటరమణ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఐఏఎస్‌ల గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత అధికారులు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

అధ్వానంగా అచ్యుతాపురం జంక్షన్

మోసయ్యపేటలో క్షీణించిన పారిశుధ్యం

» ఇళ్ల మధ్య నిలిచిన మురికి నీరు
» చెత్తతో పూడుకుపోయిన కాలువలు
» దోమలతో ప్రజలు ఇబ్బందులు
» రోడ్డుపై పారులున్న మురికి నీరు


ఎలమంచిలి రోడ్డులో రోడ్డుపై పారుతున్న మురికి నీరు


గాజువాక రోడ్డులో కాలువలో మురికి నీరు నిలిచిపోయిన దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 10: అచ్యుతాపురం నాలుగురోడ్ల కూడలితో పాటు మోసయ్యపేటలో పారిశుధ్యం క్షీణించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోసయ్యపేటలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నది. మోసయ్యపేటలోని మురుగు నీరు అచ్యుతాపురం జంక్షన్ గుండా పారుతుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అచ్యుతాపురం జంక్షన్‌గా పేరుగాంచిన ప్రాంతం నిజానికి అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో లేదు. మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఉంది. పూడిమడక రోడ్డులో గల రామాలయం వరకు మోసయ్యపేట పంచాయతీ పరిధిలోనే ఉంది. అందువల్ల ఇక్కడ పారిశుధ్య పనులు మోసయ్యపేట పంచాయతీ చూసుకోవాలి. కాని పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు నీరు ఇలా రోడ్డుపై ఏరులా పారుతోంది. దీనికి తోడు ఈ ప్రాంతంలోనే మాంసం విక్రయ కేంద్రాలున్నాయి. వీటి వ్యర్థాలు కూడా కాలువల్లో పడేయడంతో అవి పూర్తిగా పూడుకుపోయి మురికి నీరు పోయే మార్గం లేక రోడ్డుపైకి వచ్చేస్తోంది. కాలువల్లో పూడికలు తీస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. కాని పూడికలు తీసే నాథుడే కరువయ్యారు.

టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

» నర్సింగబిల్లి, జానకిరాంపురం గ్రామాల్లో వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు
» అందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం


నర్సింగబిల్లిలో అయ్యన్న, విజయ్‌లకు హారతి ఇస్తున్న మహిళలు


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అయ్యన్న

గొలుగొండ, మార్చి 10: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ నర్సింగబిల్లి, జానకిరాంపురం గ్రామాల్లోని అధికార పార్టీ వైసీపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ అడిగర్ల చినబాబులు, వార్డు సభ్యురాలు మాకిరెడ్డి సత్యవతి, యువకులు నిద్ర మధు, నర్సిపల్లి మోహన్, రాయపురెడ్డి నర్సింహమూర్తి, రాయపురెడ్డి అప్పలనాయు, ఇద్దరు గ్రామ వలంటీర్లతో పాటు భారీ సంఖ్యలో ఆదివారం టీడీపీ గూటికి చేరారు. వీరందరికీ అయ్యన్నపాత్రుడు నర్సింగబిల్లిలో కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఉద్యోగాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగన్ అసమర్థత కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని వాపోయారు. టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తే, వైసీపీ హయాంలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు రావాలన్నా, ప్రజల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్నా టీడీపీకి రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటో, వైసీపీ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చర్చించేందుకు సిద్ధమా.. అని అయ్యన్న ఎమ్మెల్యే గణేశ్‌కు సవాల్ విసిరారు. ఆరిలో ఆటవీ ప్రాంతంలో మూడున్నర కిలోమీటర్లు, గొలుగొండ, నాతవరం రెండు కిలోమీటర్లు లింకు రోడ్డు వేయాలని నువ్వా.. అభివృద్ధి గురించి మాట్లాడేదని ఎమ్మెల్యే గణేశ్‌ను ఉద్దేశించి అయ్యన్న వ్యాఖ్యానించారు. వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలకు చెక్‌పెట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైసీపీని ఇంటికి పంపించేందు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణేశ్ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్రి నాయుడు, నాయకులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గెడ్డం నానాజీ, బెల్లపు రాజులమ్మ, చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జి, గెడ్డం సత్యనారాయణ, కొల్లి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, కొల్లి రాంబాబు, బెల్లపు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

» సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ పిలుపు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ

కొత్తూరు, మార్చి 10: మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు ఆలస్యంగా ఓటు హక్కు వచ్చిందని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు దూసుకువెళ్తున్న ఎప్పటికీ బానిసలుగానే చూస్తున్నారన్నారు. పురుషులతో సమానంగా సైన్యంలోని కూడా మహిళలు ఈ రోజు ఉన్నారన్నారు. రోజురోజుకీ మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయన్నారు. శ్రామిక మహిళలు ఇంటి పని బయటి పనులతో మరింత ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, జిల్లా కార్యదర్శి డీడీ.వరలక్ష్మి అంగన్‌వాడీ వర్కర్స్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఐక్య ఉపాధ్యాయ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల ఉమెన్ హాకీ టోర్నీలో రన్నర్‌గా అనకాపల్లి జిల్లా జట్టు


హాకీ టోర్నీలో రన్నర్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా జట్టు

ఎలమంచిలి, మార్చి 10: ఒంగోలులో జరుగుతున్న 14వ సీనియర్ ఉమెన్ అంతర్ జిల్లాల హాకీ టోర్నీలో అనకాపల్లి జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నట్టు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొరారు నరేష్ ఆదివారం తెలిపారు. కాకినాడ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా పోరాడినట్టు తెలిపారు. కాకినాడ జట్టుపై అనకాపల్లి జట్టు 0-3 పెనాల్టీ షూట్ అవుట్‌లో ఓటమి చెందారనన్నారు. ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న జట్టును సంఘ అధ్యక్షుడు ఆడారి వీరునాయుడు, ప్రతినిధులు ఏబీఎల్.రాజు, కల్పన, జి.రాంబాబు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

మాకవరపాలెం వైసీపీలో ముసలం!

» అసంతృప్తి నాయకుల ఆధ్వర్యంలో రాచపల్లిలో సమావేశం
» ఐదు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరు
» త్వరలో పార్టీని వీడాలని సమష్టిగా నిర్ణయం


రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద సమావేశమైన వైసీపీ అసంతృప్తి నాయకులు, కార్యకర్తలు

మాకవరపాలెం, మార్చి 10: మండలంలో గత కొంత కాలంగా వైసీపీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న ఆ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద సమావేశమయ్యారు. రాచపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు రుత్తల వేంకటేశ్వర్లు (జమీందార్)తో పాటు రామన్నపాలెం పంచాయతీ శివారు వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అడిగర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఐదు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి నాయకత్వం వల్ల పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయామని వాపోయారు. ఈ సమస్యను పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు నిజమైన కార్యకర్తలకు జగనన్న ఇళ్ల స్థలాలు కూడా ఇప్పించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని అధికారంలో ఉండి కూడా చిరవకు కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికీ తమ జిరాయితీ భూములు తప్పుగా ఏపీఐసీ రికార్డుల్లో నమోదై ఉన్నా ఆ భూములను సైతం రెవెన్యూ రికార్డుల్లో సరిచేయించుకో లేకపోయామని వాపోయారు. తర్వలోనే ఈ పార్టీకి సరైన సమాధానం చెప్పాలని వారు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అయితే రెండు రోజుల్లో వైసీపీని వీడి మరో పార్టీ తీర్థం పుచ్చుకుందామని సమావేశానికి హాజరైన కార్యకర్తలంతా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాచపల్లి, ధర్మవరం, ఎరకన్నపాలెం, కొత్తపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల నుంచి సుమారు 70 మంది ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ సమావేశంలో ఏర్పాటు చేసిన అనంతరం ఇద్దరు వైసీపీ నాయకులను వీరి వద్దకు రాయబారానికి పంపించారు. అయినప్పటికీ సదరు అసంతృప్త నాయకుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో వారు వెనుదిరిగారు.

రాష్ట్ర భవిష్యత్తుకే పొత్తులు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 10: రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తులు ఏర్పాటు చేసుకున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనసేన, బీజేపీ, టీడీపీ పొత్తుతో అధికార పార్టీలో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. మతిభ్రమించిన అధికార పార్టీ నాయకులు అర్థం కాని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే చెందుతుందన్నారు. తెలుగు ప్రజల కోసం టీడీపీ సంకల్పించిన మహాయజ్ఞానికి జనసేన, బీజేపీలు కలిసి రావడం ఆనందదాయకమన్నారు. చంద్రబాబునాయుడు పాలన రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్న వైసీపీ నాయకులకు దమ్ముంటే బీజేపీని గెలికి చూడాలన్నారు. కమలనాథులతో పెట్టుకుంటే జగన్‌రెడ్డి మరలా జైలు ఊసలు లెక్క పెట్టాల్సి వస్తుందన్న విషయం గ్రహించి జాగ్రత్త పడుతున్నారన్నారు. సీబీఐ, ఈడీ కేసులతోపాటు వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన పాత్ర పోషించిన అవినాష్‌రెడ్డిని కాపాడేందుకే ఢిల్లీ పర్యటనలు చేశారు తప్ప విభజన చట్టంలో హామీలు, నిధులు, విశాఖ రైల్వేజోన్ గురించి కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర స్థితిగతులు గాడిన పడాలంటే వైసీపీని తరిమికొట్టడం అవసరమని, అందుకు పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల గణేష్, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

తుమ్మపాల, మార్చి 10: అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం ఉదయం పది గంటలకు తెలుగుదేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశం జరగనున్నట్టు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు. కార్యకర్తలంతా ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీల వేతన వెతలు

» ఆరు వారాలుగా నిలిచిన చెల్లింపులు
» అవస్థలు పడుతున్న వేతనదారులు


సుంకపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోటవురట్ల, మార్చి 10: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు గత ఆరు వారాల నుంచి వేతనాలు అందలేదు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు, పారంపాండ్స్, తవ్వకాలు వంటి పనులను చేయిస్తున్నది. దినసరి వేతనం కింద రూ.272 చెల్లించాలని నిర్ణయించింది. మండలంలో 25 గ్రామపంచాయతీల్లో సంక్రాంతి తరువాత నుంచి ఇప్పటి వరకు ఉపాధి పనులను సంబంధిత అధికారులు చేయించారు. అయితే పనులు చేసిన కూలీలకు వేతనాలు మాత్రం అందలేదు. మండలంలో దాదాపుగా 10 వేలమంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. ప్రస్తుతం 3,600 మంది కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని కె. వెంకటాపురం, కొడవటిపూడి, లింగాపురం, తంగేడు, గొట్టివాడ, జల్లూరు, పందూరు, పాములవాక, బీకేపల్లి, పీకేపల్లి, కోటవురట్ల గ్రామాల్లో కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే వేతనాలు అకౌంట్లలో పడతాయని కూలీలు బ్యాంకులకు వెళ్లి తీవ్రనిరాశతో వెనుదిరుగుతున్నారు. వేతనాలు ప్రక్రియ మాత్రం ఆలస్యంగా అవుతుండడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. సకాలంలో కూలీలు అందిస్తే కుటుంబ పోషణకు ఉపయోగపడతాయని, ఎప్పుడో ఇస్తామంటే ఎలా బతకాలని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు.

రూ.3 కోట్ల బకాయిలు పెండింగ్

ఉపాధి హామీ ఏపీవో గంగునాయుడు

ఉపాధి హామీ పథకంలో 3,600 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి పనిచేసిన కూలీలకు వేతనాల చెల్లింపులు జరగలేదు. సుమారు రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఎస్‌పీసీ అకౌంట్‌కు ఈ-కేవైసీ చేయించుకున్న కూలీలకు డీపీటీ ద్వారా వ్యక్తిగత అకౌంట్‌లకు వేతనాలు జమ అవుతాయి.

ముగిసిన కల్యాణపులోవ తిరునాళ్లు


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, శ్రీవారి భక్తులు

రావికమతం, మార్చి 10 : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కల్యాణపులోవలో శుక్రవారం ప్రారంభమైన తిరునాళ్లు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. తొలి రోజు 90వేల మంది, రెండో రోజు రెండు లక్షల మంది, చివరి రోజు 30వేల మంది భక్తులు తరలి వచ్చినట్టు అంచనా. భక్తులు హుండీలో వేసిన, తలనీలాలు తదితరాల ద్వారా ఏడాది ఆలయానికి రూ.16,47,081 ఆదాయం సమకూరినట్టు దేవదాయ శాఖ అధికారిణి కిరణ్మయి తెలిపారు. గత ఏడాది రూ.14,27,901 ఆదాయం రాగా, ఈ ఏడాది రెండు లక్షల వరకు పెరిగిందన్నారు. ఈవో, కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు, సర్పంచ్ వంజరి గంగరాజు పర్యవేక్షణలో 40 మంది మంది శ్రీవారి భక్తులు హుండీల లెక్కింపును ఆదివారం చేపట్టారు.

ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు


డాబాగార్డెన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

విశాఖపట్నం, మార్చి 10: ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ, ఇతర గిరిజన సమస్యలపై ఆదివారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ దరి అంబేద్కర్ విగ్రహం ఎదుట మన్యం బంద్‌కు మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు 100 శాతం తమకు ఇవ్వాలన్నారు. జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి జీతాలు పెంచాలన్నారు. రాష్ట్రంలో నాన్‌షెడ్యూల్డ్ 1500 గిరిజన గ్రామాలకు షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు, ఆయుధ కర్మాగారం నిర్మాణం వెంటనే రద్దు చేయాలన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆదివాసీవాల్మీకి, కొండదొర తెగలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జోంజుబాబు, బొండా తౌడన్న, ఎం.గౌరీశంకర్, టి.శంకరరావు, కోటిబాబు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఆర్.సత్యారావు, రామన్న, రామారావు, గోపాల్, పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం

» అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా దంపతులు

అనకాపల్లి టౌన్, మార్చి 10: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర దగ్గర పడుతుండడంతో ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. ఆదివారం అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు వివాహ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం తన నివాసం నుంచి భారీ ఊరేగింపుతో అమ్మవారి ఆలయానికి చేరుకుని కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఇటీవల వివాహాలు జరుపుకున్న కుటుంబాలు కూడా అమ్మవారి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా పాలకమండలి సభ్యులు, అధికారులు చర్యలు చేపట్టారు.


ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేత్రపర్వంగా నూకతాత సంబరం

» కిక్కిరిసిపోయిన రాజయ్యపేట రహదారులు » 2 కి.మీ పొడవునా గ్రామదేవత ఆశీస్సుల కోసం వేచివున్న భక్తులు


భక్తులపై నుంచి దాటుతున్న పూజారులు


ఘటాన్ని పట్టుకున్న మాజీ ఎమ్మెల్యే అనిత

నక్కపల్లి, మార్చి 10: మండలంలోని రాజయ్యపేటలో గంగపుత్రుల ఆరాధ్యదైవమైన నూకతాత జాతర ఆదివారం నేత్రపర్వంగా సాగింది. రాజయ్యపేట నుంచి సముద్రతీరం వరకూ వున్న ప్రధాన రహదారి,వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ముందుగా సీతారాములు, శక్తి దేవతలు, వీరులు, తదుపరి నూకతాత ఘటాలకు సముద్రంలో స్నానాలు చేయించారు. అనంతరం తీరం నుంచి గ్రామం వరకూ ఊరేగింపు జరిపారు. మత్స్యకారులతోపాటు ఇతర గ్రామాలకు చెందిన భక్తులు ముందుగానే రాజయ్యపేట ప్రధాన రహదారిపై నూకతాత ఆశీస్సుల కోసం (పాన్పుగా) పడుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా రోడ్డుపై భక్తులు వుండగా, పూజారులు వారిపై నుంచి దాటుకు వెళ్లారు. గ్రామంలో పెద్ద ఎత్తున జాతర జరిగింది. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, వైసీపీ ఇన్‌చార్జి కంబాల జోగులు నూకతాత ఉత్సవంలో పాల్గొన్నారు. గ్రామ దేవతల ఘటాలను పట్టుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

నూకతాత జాతరలో కానిస్టేబుల్‌కు గాయాలు

మండలంలోని రాజయ్యపేటలో నూకతాత జాతర సందర్భంగా శనివారం అర్ధరాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్‌లో ఒక కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. శనివారం రాత్రి వినోద కార్యక్రమం నిర్వహించినప్పుడు వేదిక వద్ద గుమిగూడిన వారిని అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బంగారి కిందకు దింపే ప్రయత్నం చేస్తుండగా, అదే సమయంలో గుర్తు తెలియని యువకుడు విసిరిన రాయి కానిస్టేబుల్ నుదురుకు తగిలింది. దీంతో అతనికి స్వల్పగాయాలయ్యాయి. మూడు కుట్లు పడ్డాయి.


కశింకోట టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

గంటాను కలిసిన కశింకోట టీడీపీ నేతలు

కశింకోట, మార్చి 10 : విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును టీడీపీ మండల నాయకులు ఆదివారం విశాఖపట్నం స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివారావు మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఎవరికి సీటు ఇచ్చినా కష్టపడి గెలుపు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయేది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గంటాను కలిసిన వారిలో గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నక్కపల్లి, మార్చి 10: నక్కపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. నక్కపల్లి గురుకులంలో ఐదో తరగతిలో 80 సీట్ల భర్తీకి గాను 180 మంది బాలికలు పరీక్షలు రాయల్సివుండగా, 155 మంది రాసినట్టు ప్రిన్సిపాల్ సువర్ణ చెప్పారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో 80 సీట్లకు గానూ 126 మంది పరీక్షలు రాయల్సివుండగా, 113 మంది మాత్రమే రాశారని చెప్పారు. ఎంఈవో కె.నరేశ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

సబ్బవరంలో.. స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 2024-25 సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంత్సరంలో ప్రవేశాలకు ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 400 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షకు 267 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ సత్యారావు తెలిపారు. ప్రవేశ పరీక్షలకు పరిశీలకులుగా నాంచారి, కె శ్రీహరి, ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు.


నక్కపల్లిలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు



వాడచీపురుపల్లిలో కేంద్ర బలగాలు కవాతు

పరవాడ, మార్చి 10 : మండలంలోని వాడచీపురుపల్లిలో కేంద్ర పారా మిలిట్రీ దళాలు, పరవాడ పోలీసులు ఆదివారం హైస్కూల్ నుంచి ఎస్సీ బాలుర వసతిగృహం వరకు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ బాల సూర్యారావు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే విధంగా ప్రజల్లో విశ్వాసం నింపేందుకు ఈ కవాతు నిర్వహించినట్టు చెప్పారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త జిల్లాలకు ఎస్ఈలు ఏరి?

... 5వ పేజీ తరువాయి

ఎస్ఈ ఉండాలి. మూడు జిల్లాలకు కలిపి ఒకరే ఎస్ఈ ఉండడంతో ఒక్కచోట మాత్రమే హాజరుకాగలుగుతున్నారు. స్మార్ట్‌సిటీగా విశాఖకు, వందలాది పరిశ్రమలున్న జిల్లాగా అనకాపల్లికి, ఏజెన్సీ కేంద్రంగా అల్లూరి జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్కరే ఎస్ఈతో పని విభజనకు అవకాశం లభించడం లేదు. విశాఖలో జిల్లా పరిషత్ సమావేశాలు నిర్వహించినప్పుడు అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రజాప్రతినిధులు దీనిపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకువెళుతున్నా ఫలితం కనిపించడం లేదు,

ఏళ్లుగా పదోన్నతులూ లేవు

ఈపీడీసీఎల్‌లో ఇంజనీర్లకు ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించడం లేదు. అసిస్టెంట్ ఇంజనీర్ ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నా డివిజనల్ ఇంజనీర్ కాలేకపోతున్నారు. కొత్త జిల్లాల్లో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సీనియర్ డీఈలకు ఎస్ఈలుగా, మిగిలిన వారికి ఇతర హోదాల్లో పదోన్నతులు లభిస్తాయి. ఆయా కార్యాలయాలకు అవసరమైన సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్ల అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి.

16న ప్రధాని మోదీ విశాఖ రాక

... 5వ పేజీ తరువాయి

తొలుత భావించారని, అయితే మెజారిటీ నేతలు ర్యాలీ కంటే బహిరంగ సభ నిర్వహిస్తే ఎక్కువ ఆదరణ లభిస్తుందని చెప్పడంతో సభ నిర్వహణకే మొగ్గు చూపారని చెబుతున్నారు. టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు కుదరడంతో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా ప్రధాని ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలో జరగనున్న ఎన్నికల ర్యాలీలో పాల్గొంటారు. మోదీ పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావాల్సి ఉంది.

అంగన్‌వాడీలకు మొండిచేయి!

... 5వ పేజీ తరువాయి

చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఆయాలు, మినీ కేంద్రాల కార్యకర్తలకు రూ.1,18,86,000, మెయిన్ కేంద్రాలు కార్యకర్తలకు రూ.1,80,09,000.. మొత్తం రూ.2,98,95,000 అందాల్సి వుంది. సమ్మె కాలానికి సంబంధించిన బకాయిలు, ఫిబ్రవరి వేతనం కలిపి ఒక్కో ఆయాకు రూ.16,340, కార్యకర్తకు రూ.26,850 చొప్పున మొత్తం రూ.6,97,92,420 బకాయిలను ప్రభుత్వం చెల్లించాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే బకాయిలు చెల్లించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరతున్నారు.

బిల్లులకూ మోక్షం లేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్కడే భోజనం వండి, వడ్డిస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే కూరగాయలు, ఇతర వంట సామగ్రితో పాటు వంట గ్యాస్ కొనుగోలు చేస్తుంటారు. ఇందుకయ్యే ఖర్చుకు సంబంధించిన బిల్లులు సమర్పిస్తే ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే గత జూలై నుంచి నవంబరు వరకు, మళ్లీ ఫిబ్రవరి నెలకు సంబంధించిన బిల్లులన్నింటినీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్యనుబట్టి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.వెయ్యి రూ.2,500 వరకు ఖర్చవుతుంది. ఒక్కో కార్యకర్తకు ఆరు నెలలకు సంబంధించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు బిల్లులను చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా బిల్లులు పెట్టడం మినహా చెల్లింపులపై అధికారులు పెదవి విప్పడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

» వైసీపీ ప్రభుత్వం రాకతో నిలిచిపోయిన వైనం
» ఐదేళ్లుగా చిన్నారులు ఎదురుచూపులు


రాయపురఅగ్రహారంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

సబ్బవరం, మార్చి 10 : మండలంలోని రాయపురఅగ్రహారంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం ప్రారంభించి ఐదేళ్లు అయినా ఇప్పటికీ పూర్తి కాలేదు. అంగన్‌వాడీ చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. బేస్మెంట్, కాలమ్స్, శ్లాబ్ పనులు పూర్తయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగతా పనులు నిలిచిపోయాయి. అప్పటినుంచి ఆ భవన నిర్మాణం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి గ్రామంలోని ఇక ప్రైవేటు భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

అచ్యుతాపురం, మార్చి 10: స్థానిక దివ్యాంగుల పాఠశాలలో సత్యసాయిబాబా 99వ జయంతిని ఉక్కునగరం సమితి యువకులు ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పిల్లలకు టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బు, చాక్లెట్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం పిల్లలచే ఆధ్యాత్మిక ఆటలు, భజనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పీఎస్‌టీ పట్నాయక్, కె. ప్రకాశరావు, జి. రామకృష్ణ, రామస్వామి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిని టీడీపీకి కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

అచ్యుతాపురం, మార్చి 10: ఎలమంచిలి ఎమ్మెల్యే సీటు టీడీపీకి కేటాయించాలంటూ ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమైన నాయకులు తీర్మానించారు. ఈ తీర్మానాన్ని పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు పంపాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ ఆరు సార్లు టీడీపీ ఎమ్మెల్యేలు విజయం సాధించారని, 2019లో స్వల్ప మెజారిటీతో టీడీపీ అభ్యర్థి ఓటమి చెందారని పేర్కొన్నారు. అందువల్ల పునఃపరిశీలన చేసి, ఎలమంచిలిని టీడీపీ కేటాయించాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, దూళి రంగనాయకులు, పార్టీ మండల అధ్యక్షుడు జనరెడ్డి నరసింగరావు, నాయకులు మేరుగు బాపునాయుడు, వసంతవాడ దిన్‌బాబు, నీరుకొండ నరసింగరావు, దొడ్డి శ్రీనివాసరావు, గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి రాజు పాల్గొన్నారు.

తీరాల్లో పుణ్య స్నానాలు


సముద్రస్నానాలతో కిటకిటలాడుతున్న బోయపాడు తీరం

నక్కపల్లి, మార్చి 10: మండలంలోని రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాల్లో అమావాస్య సందర్భంగా ఆదివారం వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలాచరించారు. బోయపాడు తీరంలో సుమారు 50 వేలమంది భక్తులు స్నానాలాచరించారు. రాజయ్యపేట సముద్రతీరం కూడా భక్తులతో కిక్కిరిసిపోయింది. బోయపాడు తీరంలో తీర్థం సాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అడ్డరోడ్డులో మెగా రక్తదాన శిబిరం

ఎస్. రాయవరం, మార్చి 10: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురం లో ఆదివారం శ్రీ కుసుమ కావ్య ఫౌండేషన్, స్థానిక యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 120 మంది రక్తదానం చేసినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జనసేన పార్టీ సీనియర్ నేత సేనపతి బాబూరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎలమంచిలి, మార్చి 10 : పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న నూకాంబికా అమ్మవారి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమరాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి 'సుందరపు' పూజలు


పూజలు చేస్తున్న జనసేన నేత సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మార్చి 10: స్థానిక గొల్లలకొండపై ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్ తదితరులు పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్న సమరాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న సీసీ రోడ్లు


దిమిలిలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న వాడుకనీరు

రాంబిల్లి, మార్చి 10 : మండలంలోని దిమిలి, వాడనర్సాపురం గ్రామాల్లోని సీసీ రోడ్లు కాలువల్లా మారి కంపుకొడుతున్నాయి. ఈ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు సీసీ రోడ్లపై ప్రవహిస్తుండడంతో కాలువలను తలపించే విధంగా తయారయ్యాయి. మురుగునీరు కంపుకొడుతుండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అంతేకాకుండా రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉన్న కాలువలు పారకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపైకి వచ్చేస్తుందని, పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. దిమిలి, వాడనర్సాపురం గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

'మహిళా సాధికారితకు కృషి అభినందనీయం'

కొత్తూరు, మార్చి 10: మహిళల్లో సాధికారత తీసుకురావడానికి, స్వయం జీవనోపాధిని కల్పించడానికి లయన్స్ క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. ఆదివారం గాంధీనగరం లయన్స్ క్లబ్ హాలులో జరిగిన మహిళా సాధికారత సదస్సులో ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధిని సాధించడానికి స్పందన చేయూత చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అనకాపల్లి శాఖ అధ్యక్షుడు వెంకటరాజు, పూర్వపు గవర్నర్ వీఎస్ నూకరాజు, స్పందన చేయూత ఫౌండేషన్ ఛైర్మన్ ఈపూరు బుచ్చిరాజు, లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్ పూసర్ల సునీల్ పాల్గొన్నారు.

వందేభారత్‌కు అనకాపల్లిలో హాల్టు ఇవ్వాలి

కొత్తూరు, మార్చి 10: వందేభారత్ రైలుకు అనకాపల్లిలో హాల్టు ఇవ్వాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి లేఖ రాశారు. ఈనెల 12న సికింద్రాబాద్-విశాఖ- సికింద్రాబాద్‌కు వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చ్యువల్‌లో ప్రారంభించనున్నారన్నారు. ఇంతకు ముందు విశాఖ నుంచి వెళుతున్న వందేభారత్ రైలుకు అనకాపల్లిలో హాల్ట్ ఇవ్వాలని ఆమె కోరారు. ఎంతోమంది ప్రయాణికులు అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ లేఖను రైల్వే బోర్డు ఛైర్మన్ జయవర్మ సిన్హా, సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్‌కు కూడా పంపినట్టు ఎంపీ సత్యవతి తెలిపారు.

జనసేనలో చేరిన యువకులు


పార్టీలో చేరిన వారిని ఆహ్వానించిన కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 10 : స్థానిక టీచర్స్ కాలనీలోని కొణతాల క్యాంప్ కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి అయిన కొణతాల రామకృష్ణ సమక్షంలో కొప్పాక, జోగారావుపేట, కుంచంగి, వెదురుపర్తి గ్రామాల నుంచి యువకులు వచ్చి జనసేన పార్టీలో చేరారు. వీరికి కొణతాల జనసేన కండువాలు వేసి స్వాగతించారు. కొణతాల గెలుపునకు సంపూర్ణ సహకారమందిస్తామని యువకులు పేర్కొన్నారు.

మార్కెట్‌యార్డులో సోలార్ వెలుగులు

అనకాపల్లి టౌన్, మార్చి 10 : స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శనివారం రాత్రి నుంచి సోలార్ లైట్ల వెలుగులు అందుబాటులోకి వచ్చాయి. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి ఎంపీ నిధులతో మార్కెట్‌యార్డులోని పది చోట్ల సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. మార్కెట్‌యార్డులో సోలార్‌లైట్ల ఏర్పాటు చేసినందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.


మార్కెట్‌యార్డులో సోలార్ లైట్లు వెలుగుతున్న దృశ్యం

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


సావిత్రిభాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గనిశెట్టి

పరవాడ, మార్చి 10 : స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం పోరాడిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం చినతాడి గ్రామంలో నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ప్రతినిధులు ఎస్. వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మి, రమణమ్మ, వరలక్ష్మి, పార్వతి, పద్మ, అప్పలనరసింహ పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

పరవాడ, మార్చి 10 : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గెంజిపేటలో నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బాబు సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్‌లను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని అయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రమణ, అర్జున్, గెంజి రాజు, తురతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభయహస్తం ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి

» కాంగ్రెస్ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాయకరావుపేట, మార్చి 10 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయహస్తం పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ అభయహస్తం యాప్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభయహస్తం యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి పేదకుటుంబానికి నెలకు రూ.5వేల చొప్పున సాయం అందజేస్తామన్నారు. అనంతరం స్థానిక మంగవరం జంక్షన్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, పట్టణంలో ర్యాలీ నిర్వహించి పార్టీ మేనిఫెస్టోపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి నారాయణచక్రవర్తి, నాయకులు మోర్త సింహాచలం, సుంకర సూర్యవతి, చక్రధరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

380 మందికి కంటి వైద్య పరీక్షలు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, మార్చి 10: బ్రాండిక్స్‌లో ఆదివారం నిర్వహించిన 122వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 380 మందికి పరీక్షలు నిర్వహించినట్టు పరిశ్రమ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. ఇందులో 237 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయగా.. 113 మందికి మందులిచ్చామన్నారు. అలాగే 30 మందికి శస్త్రచికిత్సలకు వైద్యులు ఎంపిక చేయడంతో వారికి విశాఖలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తామని ఆయన తెలిపారు. శిబిరానికి హాజరైన వారందరికీ ఫలహారం, మజ్జిగ, భోజనం ఏర్పాటు చేశామన్నారు.

బంగారం వర్తకుడు నాగేశ్వరరావు కన్నుమూత



అనకాపల్లి టౌన్, మార్చి 10 : పట్టణానికి చెందిన ప్రముఖ బంగారం వర్తకుడు మళ్ల నాగేశ్వరరావు(70) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న నాగేశ్వరరావు సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో కన్నుమూసినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన మృతి చెందడం పట్ల బంగారం వర్తకులు రింగురోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మృతికి సంతాపంగా సోమవారం పట్టణంలోని బంగారం దుకాణాలన్నీ మధ్యాహ్నం రెండు గంటల వరకు మూసివేయనున్నట్టు బంగారం వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర తెలిపారు.

బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయరా..?

▸▸ మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం




బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలంలో పెట్టిన బడ్డీ

నర్సీపట్నం, మార్చి 10 : పురావస్తు శాఖ ఆధీనంలో ఇక్కడున్న బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం సమీపంలోని దామనాపల్లి ఘాట్‌లో 1922 సెప్టెంబరు 24న అల్లూరి సీతారామరాజు అనుచరులు మాటు వేసి హైటర్, కవర్ట్ అనే ఇద్దరు బ్రిటీష్ సైనికాధికారులను కాల్చి చంపారు. ఈ ఇద్దరి మృతదేహాలను రెవెన్యూ డివిజనల్ కేంద్రం నర్సీపట్నం తరలించి, గ్రామ శివార్లలోని ఖాళీ స్థలంలో ఖననం చేశారు. అంతకు ముందు గొలుగొండ సంస్థానంలో బ్రిటీష్ ప్రతినిధిగా పనిచేస్తూ వయస్సు రీత్యా మృతిచెందిన జేమ్స్ గిప్సన్ మృతదేహాన్ని ఖననం చేసిన ప్రాంతంలోనే హైటర్, కవర్ట్ సైనికాధికారుల మృతదేహాలను కూడా ఖననం చేశారు. 46 సెంట్లు విస్తీర్ణం గల స్థలంలో ముగ్గురు అధికారులకు బ్రిటీష్ ప్రభుత్వం సమాధులు నిర్మించింది. అంతేకాకుండా నిషిద్ధ భూమిగా ప్రకటించి సమాధుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంది. పట్టణం నడిబొడ్డులో మెయిన్ రోడ్డును ఆనుకొని చెక్కావారి బంకు ఎదురుగా ఈ సమాధులు ఉన్న స్థలం ఉంది. స్వాతంత్ర్యం అనంతరం కాలక్రమేణా రెవెన్యూ అధికారులు పది సెంట్ల స్థలంలో పట్టాలిచ్చారు. ఇక్కడ స్థలం సెంటు రూ.80 లక్షలు ధర పలుకుతుంది. ఇదిలావుంటే, రోడ్డు విస్తరణలో భాగంగా మునిసిపల్ అధికారులు సమాధుల స్థలంలోని ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు ఆయా స్థలంలో పలువురు బడ్డీలు పెడుతున్నారు. దీనిపై పన్ను చెల్లింపుదారుల సంఘం కార్యదర్శి కె.శివనారాయణరాజు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఆ స్థలం ఆక్రమణపై సోమవారం స్పందనలో ఫిర్యాదు చేయనున్నట్టు అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మన్యం బంద్ ప్రశాంతం

▸▸ ఏజెన్సీ వ్యాప్తంగా మూతపడిన వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలు

▸▸ రోడ్డెక్కని ప్రైవేటు వాహనాలు



మన్యం బంద్‌తో నిర్మానుష్యంగా మారిన అరకులోయ ప్రధాన రహదారి

పాడేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా గిరిజన సంఘం, డీఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఏజెన్సీలో అన్ని మండలాల్లో దుకాణాలు, హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. ప్రైవేటు వాహనాలు, ఆటోలు రోడ్డెక్కలేదు. పోలీసుల ప్రమేయంతో పీటీడీ బస్సులను అరకొరగా నడిపారు. గిరిజన సంఘం జాతీయ సభ్యుడు పి.అప్పలనర్స, జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, తదితరులు పాడేరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను అడ్డుకోవడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, సుప్రీం కోర్టు రద్దు చేసిన జీవో నంబరు-3ను ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరణ, ఏజెన్సీలో శత శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే కేటాయింపు, ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు రద్దు, తదితర పది డిమాండ్లను అమలు చేయాలని అన్నారు. కాగా నిత్యం జనంతో రద్దీగా ఉండే పాడేరు అంబేడ్కర్ కూడలి, ప్రధాన రహదారులు బంద్ కారణంగా నిర్మానుష్యంగా మారాయి. అరకులోయలో గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్, అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, ఇతర ప్రాంతాల్లోని చాపరాయి, కొత్తపల్లి జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలు మూతపడ్డాయి.

16న ప్రధాని మోదీ విశాఖ రాక

... 5వ పేజీ తరువాయి

తొలుత భావించారని, అయితే మెజారిటీ నేతలు ర్యాలీ కంటే బహిరంగ సభ నిర్వహిస్తే ఎక్కువ ఆదరణ లభిస్తుందని చెప్పడంతో సభ నిర్వహణకే మొగ్గు చూపారని చెబుతున్నారు. టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు కుదరడంతో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా ప్రధాని ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలో జరగనున్న ఎన్నికల ర్యాలీలో పాల్గొంటారు. మోదీ పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావాల్సి ఉంది.

కొత్త జిల్లాలకు ఎస్ఈలు ఏరి?

... 5వ పేజీ తరువాయి

ఎస్ఈ ఉండాలి. మూడు జిల్లాలకు కలిపి ఒకరే ఎస్ఈ ఉండడంతో ఒక్కచోట మాత్రమే హాజరుకాగలుగుతున్నారు. స్మార్ట్‌సిటీగా విశాఖకు, వందలాది పరిశ్రమలున్న జిల్లాగా అనకాపల్లికి, ఏజెన్సీ కేంద్రంగా అల్లూరి జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్కరే ఎస్ఈతో పని విభజనకు అవకాశం లభించడం లేదు. విశాఖలో జిల్లా పరిషత్ సమావేశాలు నిర్వహించినప్పుడు అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రజాప్రతినిధులు దీనిపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకువెళుతున్నా ఫలితం కనిపించడం లేదు,

ఏళ్లుగా పదోన్నతులూ లేవు

ఈపీడీసీఎల్‌లో ఇంజనీర్లకు ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించడం లేదు. అసిస్టెంట్ ఇంజనీర్ ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నా డివిజనల్ ఇంజనీర్ కాలేకపోతున్నారు. కొత్త జిల్లాల్లో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సీనియర్ డీఈలకు ఎస్ఈలుగా, మిగిలిన వారికి ఇతర హోదాల్లో పదోన్నతులు లభిస్తాయి. ఆయా కార్యాలయాలకు అవసరమైన సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్ల అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి.

అంగన్‌వాడీలకు మొండిచేయి!

... 5వ పేజీ తరువాయి

చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఆయాలు, మినీ కేంద్రాల కార్యకర్తలకు రూ.1,18,86,000, మెయిన్ కేంద్రాలు కార్యకర్తలకు రూ.1,80,09,000.. మొత్తం రూ.2,98,95,000 అందాల్సి వుంది. సమ్మె కాలానికి సంబంధించిన బకాయిలు, ఫిబ్రవరి వేతనం కలిపి ఒక్కో ఆయాకు రూ.16,340, కార్యకర్తకు రూ.26,850 చొప్పున మొత్తం రూ.6,97,92,420 బకాయిలను ప్రభుత్వం చెల్లించాలి. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే బకాయిలు చెల్లించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరతున్నారు.

బిల్లులకూ మోక్షం లేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్కడే భోజనం వండి, వడ్డిస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే కూరగాయలు, ఇతర వంట సామగ్రితో పాటు వంట గ్యాస్ కొనుగోలు చేస్తుంటారు. ఇందుకయ్యే ఖర్చుకు సంబంధించిన బిల్లులు సమర్పిస్తే ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే గత జూలై నుంచి నవంబరు వరకు, మళ్లీ ఫిబ్రవరి నెలకు సంబంధించిన బిల్లులన్నింటినీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్యనుబట్టి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.వెయ్యి రూ.2,500 వరకు ఖర్చవుతుంది. ఒక్కో కార్యకర్తకు ఆరు నెలలకు సంబంధించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు బిల్లులను చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా బిల్లులు పెట్టడం మినహా చెల్లింపులపై అధికారులు పెదవి విప్పడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

మురుగు సమస్యకు మోక్షం ఎన్నడు?

పల్లెల్లోనూ.. పట్టణాల్లోనూ ఇప్పుడు అపారిశుధ్యం పెద్ద సమస్యగా మారింది. కొన్నిచోట్ల ఎక్కడికక్కడ మురుగు తిష్ట వేస్తుండగా, మరికొన్నిచోట్ల చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో నిధుల లేమి ఇందుకు ప్రధాన కారణంగా చెపుతున్నారు. ఆర్థిక సంఘాల నిధులు చేరాల్సిన చోటుకు చేరితే.. కాస్తయినా ఈ సమస్యకు పరిష్కారం మార్గం లభించేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వీధి కాలువ నుంచి రోడ్డపైకి వస్తున్న మురుగు

▸▸ చోడవరం పట్టణంలోని పీఎస్‌పేట రహదారిపై తిష్ట

▸▸ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనచోదకులు

▸▸ పట్టించుకోని పంచాయతీ అధికారులు

చోడవరం, మార్చి 10 : పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట వెళ్లే ప్రధాన రహదారి మురుగు మయంగా మారుతోంది. దీంతో వాహనదారులతో పాటు, స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటవీధిలోని కాలువ ద్వారా వచ్చే మురుగు బయటకు పోయే దారిలేకపోవడంతో ప్రధాన రహదారిపైకి వచ్చి చేరుతోంది. గడచిన వారం రోజులుగా ఈ రహదారంతా మురుగుతో నిండిపోవడంతో వాహనదారులు ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వీధి కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతోందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేదని అంటున్నారు. అసలే గుంతలమయంగా ఉన్న ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి కీలకమైన రహదారిపైకి మురుగు వచ్చి చేరుతున్నా పంచాయతీ అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యపై దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



పీఎస్‌పేట రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

రోడ్డు పక్కనే చెత్తా చెదారం

మాడుగుల రూరల్, మార్చి 10 : పారిశుధ్య పనుల్లో పర్యవేక్షణ లోపం పల్లెల్లో ఇబ్బందికరంగా మారుతోంది. ఫలితంగా ఎక్కడికక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. టీడీపీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలను పంచాయతీల అధికారులు, పాలకులు పట్టించుకోక పోవడంతో పలుచోట్ల ఇది తీరని సమస్యగా మారుతోంది. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగుల వెళ్లే మార్గంలో ఈ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ జంక్షన్‌లో పలు దాబాలు, భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, జ్యూస్ షాపులు, తినుబండరాల దుకాణాలు, చికెన్, మటన్ షాపులు ఉన్నాయి. ఈ వ్యాపారుల్లో కొందరు దుకాణాల్లో వ్యర్థాలు, చెత్త, పాలిథిన్ కవర్లు తదితరాలను మూటలు కట్టి తీసుకు వచ్చి మాడుగుల వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పారేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు వ్యర్థాలు పేరుకు పోతుండడంతో అటుగా పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సైతం దుర్వాసనను భరించలేకపోతున్నామని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఇలా చెత్తాచెదారాన్ని పారబోస్తున్నారని అంటున్నారు. ఒక్కోసారి వీటికి నిప్పు పెడుతుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు చెత్త పారబోయడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగుల వస్తున్న రోడ్డు పక్కన చెత్తాచెదారం

టీడీపీది అభివృద్ధి మంత్రం.. వైసీపీది అవినీతి తంత్రం!

▸▸ గుమ్మిడిగొండ శంఖారావం సభలో మాజీ మంత్రి అయ్యన్న వ్యాఖ్య ▸▸ ఎన్నికల్లో టీడీపీ.. జనసేన కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి

▸▸ తన పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలని హెచ్చరిక ▸▸ మాజీ ఉప సర్పంచ్ రాంబాబుతో పాటు పలువురు పార్టీలో చేరిక



టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ బొత్సా రాంబాబు తదితరులతో అయ్యన్న



ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 10 : రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోతోందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో ఆదివారం రాత్రి ఏర్పాటైన ఎన్నికల శంఖారావ సభలో మాట్లాడారు. పట్టాదారు పాసు పుస్తకాలపైన, సర్వేరాళ్లపైన మూడు సింహాల ఫొటోలను తీసేసి జగన్ ఫొటో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కల్తీమద్యంతో నేడు ప్రజల ఆరోగ్యం పాడవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. తాను పంచాయితీరాజ్ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు రూ.తొమ్మిది కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. గుమ్మిడిగొండ- నాతవరం రోడ్డు, సిమెంట్ రోడ్లు తదితరాలు చేపట్టినట్టు గుర్తు చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈసారి టీడీపీ- జనసేన కూటమిని గెలిపించాలని గ్రామస్థులను కోరారు.

వైసీపీ ప్రభుత్వంలో తనపట్ల దురుసుగా ప్రవర్తించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే 50 ఏళ్ళు దాటిన బీసీలకు రూ.4వేలు పింఛన్ ఇవ్వనున్నామన్నారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నాతవరం మం డలంలోని గుమ్మిడిగొండ నుంచే శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. అలాగే ఈ గ్రామంలో బలహీనవర్గాల స్థలాలను వైసీపీ నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించినట్టు చెప్పారు. అంతకుముందు గుమ్మిడిగొండ మాజీ ఉప సర్పంచ్ బొత్సా రాంబాబుతో పాటు పదిమంది వైసీపీకి చెందిన నాయకులు తెలుగుదేశంలో చేరారు. వీరికి అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు నందిపల్లి వెంకటరమణ, గుమ్మిడిగొండ మాజీ సర్పంచ్‌లు సుర్ల వెంకటరమణ, చింతకాయల నాయుడుబాబు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు గాది జమీలు, పార్టీ గ్రామ అధ్య క్షుడు సిహెచ్.పెద్దినాయుడు, మడక పోతురాజు, కొరుప్రోలు చంటిబ్బాయి తదితరులతో పాటు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో ఘనంగా నాగవల్లి వసంతోత్సవం



నాగవల్లి వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

చోడవరం, మార్చి 10 : మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో నాగవల్లి వసంతోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ సాగిన ఈ వేడుకల్లో అర్చకులు కొడమంచిలి చలపతి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'కోర్టు కేసులో ఉన్న ఇనాం భూములను కాపాడండి'



సమావేశంలో పాల్గొన్న రైతులు

రోలుగుంట, మార్చి 10 : కోర్టు కేసులో ఉన్న జేపీ అగ్రహారంలోని ఇనాం భూములు క్రయ విక్రయాలు జరగకుండా అధికారులు చూడాలని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఆదివారం గ్రామంలో రైతు సంఘం నాయకుడు ఒనుం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కాలంలో ఈ భూములను క్రయ విక్రయాలు జరిపేందుకు కొంత మంది గ్రామానికి వస్తున్నారని, కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా వస్తున్నారని తెలిపారు. తరతరాలుగా రైతులే సాగుచేసుకుంటున్న ఈ భూములపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులు కూడా ఆ భూములను వెబ్ ల్యాండ్‌లో డిస్ప్యూట్ ఖాతాలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దుంగల సత్తిబాబు, బుచ్చిరాజు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

'పెద్దేరు' కాలువల సీసీ లైనింగ్ ఆధునికీకరణకు శంకుస్థాపన

మాడుగుల రూరల్, మార్చి 10 : మండలంలోని పలు గ్రామాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం పర్యటించారు. ఇందులో భాగంగా పెద్దేరు జలాశయం కుడికాలువ, ఎడమ కాలువల సీసీ లైనింగ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దేరు జలాశయం ఫోర్‌ఎల్ షైనర్ కాలువ తవ్వకాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వమ్మలి జగన్నాథపురం, కింతలి వల్లాపురం, ఒంటిమామిడిపాలెంలలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, జడ్పీటీసీ రమణమ్మ, బొమ్మిశెట్టి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శానాపతి కొండలరావు తదతరులతో పాటు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

కృష్ణాదేవిపేట, మార్చి 10 : గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో గల స్వయంభూ నీలకంఠేశ్వరస్వామి ఆలయం, కొంగశింగి శివాలయంలో ఆదివారంతో మహా శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ మూడు రోజులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రేపటి నుంచి వడ్డాదిలో మోదకొండమ్మ తీర్థం



బుచ్చెయ్యపేట, మార్చి 10 : వడ్డాది కూడలిలో కొలువుదీరిన మోదకొండమ్మ తీర్థం మంగళవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ధర్మకర్త దొండా గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

'ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు'

చోడవరం, మార్చి 10 : టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో గల దేవాలయాల అభివృద్ధికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం విలేకరులకు తెలిపారు. హిందూ ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 16 ఆలయాలకు ఈ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు.

నేడు వడ్డాది ఆలయంలో తలనీలాలకు వేలం

బుచ్చెయ్యపేట, మార్చి 10 : వడ్డాదిలోని గిరిజాంబగిరిపై కొలువుదీరిన స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద తలనీలాలకు సంబంధించి సోమవారం టెండర్, వేలం పాట నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ ఈవో శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ వేలం ప్రక్రియలో ఆసక్తిగల వారు ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు పాల్గొనవచ్చునన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ, మార్చి 10 : మంచాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో వరుసగా నాలుగు, ఐదు తరగతులు చదివిన విద్యార్థులు అర్హులన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులు రూ.75లను బ్యాంకు ద్వారా డీడీలను తీయాలన్నారు.

టీడీపీ- బీజేపీ పొత్తుతో వైసీపీ పాలన ముగిసినట్టే!

▸▸ ఇప్పటికైనా మేల్కోనకుంటే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థం

▸▸ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి



చోడవరం, మార్చి 10 : టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తీసుకున్న ఓ చారిత్రక నిర్ణయమని, దీంతో రాష్ట్రంలో వైసీపీ పాలన ముగిసినట్టేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు కుదరకపోతే రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అడ్డూ అదుపు ఉండదన్నారు. దీనివల్ల రాష్ట్రం మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి, అభివృద్ధి అడుగంటిపోయిందన్నారు. యువతకు ఉపాధి కూడా లేని పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర భవిష్యత్ కోసం మూడు పార్టీలు కలిసి పొత్తు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థుల విజయం తథ్యమన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో హైత్రిక ప్రతిభ



హైత్రికకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

బుచ్చెయ్యపేట, మార్చి 10 : విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో మండలంలోని వడ్డాదికి చెందిన అక్షర స్కూల్ విద్యార్థిని అద్భుత ప్రతిభ చూపి ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ నెల మూడో తేదీన జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో దొండా హైత్రిక ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్ తెలిపారు.

59 మందికి సీఎం సహాయ నిధి పంపిణీ



బాధితునికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 10 : నియోజకవర్గంలోని 59 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.50.18 లక్షలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ పంపిణీ చేశారు. పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీతో పాటు నాలుగు మండలాల నుంచి వైసీపీ నాయకులు హాజరయ్యారు.

శస్త్ర చికిత్స జరిగిన బాలికకు ఆర్థిక సాయం

రోలుగుంట, మార్చి 10 : ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న మండలంలోని రత్నంపేట గ్రామానికి చెందిన విరోదుల పావని అనే బాలికకు గ్రామ యువత బాసటగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన పావని సర్జరీకి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇది గుర్తించిన స్థానిక యువత, బుచ్చెంపేటకు చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శనివాడ సోమాలనాయుడు, బత్తిన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'హిందూ ధర్మాన్ని కాపాడండి'

కె.కోటపాడు, మార్చి 10 : హిందూ ధర్మ పరిరక్షణకు కుల పెద్దలు కంకణం కట్టుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ఓలేటి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన హిందూ కుల పెద్దల సమావేశంలో మాట్లాడారు. హిందువులంతా కుల ధర్మాన్ని పాటిస్తూ, కులంలో నుంచి ఎవరూ పరాయి ధర్మం వైపు వెళ్లకుండా చూడాలన్నారు. ఆర్ఎస్ఎస్ కె.కోటపాడు ఖండ కార్యవాహ డెక్క వెంకునాయుడు అధ్యక్షతన జరిగిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రొంగలి పరశురాం, శ్రీరామమూర్తి, కోటి, రాజు, రామకృష్ణ, అరినాయుడు, వెంకట్రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.